ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
సోమవారం 19 ఫిబ్రవరి 2024


మేడారంలో రోడ్లపైనే ప్లాస్టిక్ చెత్త

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం ఏది?

ప్రచారమే తప్ప ఆచరణలో విఫలం

- మేడారం జాతరలో విచ్చలవిడిగా వాడకం
- నాలుగు రోజుల్లోనే 2,500 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి
- వీటిలో 1,250 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే..
- గాజు బాటిళ్లు, జంతు వ్యర్థాలతో వాతావరణ కాలుష్యం
- భవిష్యత్తు తరాలకు ప్రమాదమంటున్న నిపుణులు

వరంగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫ్రీ ప్లాస్టిక్ జాతర.. ఇది ప్రతీ మేడారం మహజాతర ముందు ఓ ఊత పదంగా మారింది. ప్లాస్టిక్ నియంత్రణపై ప్రచార్భాటం తప్ప.. ఆచరణలో మాత్రం ఎవరూ శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులతో మేడారంలోని పచ్చని అడవుల్లో టన్నుల కొద్ది ప్లాస్టిక్ పోగవుతోంది. ప్లాస్టిక్ ఫ్రీ జాతర.. హరిత మేడారం... ఇలా ఎన్నో పేర్లతో మేడారానికి ప్లాస్టిక్ తీసురావొద్దనే ప్రచార్భాటం ప్రతీసారి జరుగుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవటం లేదు. ప్లాస్టిక్‌కుతోడు లక్షలాది జంతువుల వ్యర్థాలు, గాజు సీసాలతో వాతావరణ కాలుష్యం మరింత దెబ్బతింటోంది. 'ఫ్రీ ప్లాస్టిక్ మేడారం' నినాదమిచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నేతలే విచ్చల విడిగా జాతరలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పెడుతూ ఏం సందేశం ఇస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్లాస్టిక్ ఫుల్ మేడారం

మేడారం జాతరకు వచ్చే భక్తుడి చేతిలో ప్లాస్టిక్ దర్శనమిస్తుంటుంది. ప్లాస్టిక్ వాటర్ బాటిల్, ప్లాస్టిక్ కూల్‌డ్రింక్స్ బాటిల్స్, చివరకు తల్లులకు సమర్పించే బెల్లం బుట్టకు కూడా ప్లాస్టిక్ కవర్ దర్శనమిస్తుంది. ప్లాస్టిక్ వినియోగం లేకుండా ఏ ఒక్క భక్తుడు కనిపించడంటే అతియోశక్తి కాదు. ఇక లక్షలాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం అడవిప్రాంతం మొత్తం ప్లాస్టిక్‌తో నిండిపోతుంది. ఓవైపు ప్లాస్టిక్ నిషేధానికి ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమమే నడుస్తోంది. భూమిలో కూరుకుపోయిన ప్లాస్టిక్ మట్టిలో కలిసిపోయేందుకు వందేళ్లకు పైగా సమయం పట్టవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మహజాతరతో మేడారం పరిసరాలు ప్లాస్టిక్‌తో భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. భూకంపాలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్లాస్టిక్‌ను నియంత్రించాలని సూచిస్తున్నారు.


ప్లాస్టిక్ కాలకేయ(ఫైల్)

ఎక్కడి చెత్త అక్కడే పూడ్చివేత

మహజాతర సందర్భంగా వేల టన్నుల్లో పోగవుతున్న చెత్తను స్థానింగా ఉన్న అడవుల్లోనే పూడ్చివేయటం లేదా కాల్చి వేయడం చేస్తున్నారు. మేడారానికి చుట్టు పక్కల ఉన్న నార్లాపూర్, కొంగలగుట్ట, గుడ్డేలుగు గుట్ట, రెడ్డిగూడెం, ఊరట్టం తదితర ప్రాంతాల్లో ఉన్న అడవుల్లో భారీ గుంతలు తవ్వుతుంటారు. ప్రతీ మహజాతరలో ఉత్పత్తి అయ్యే కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి వాటి వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు, బియ్యం, బెల్లం, గాజులు తదితర వాటిని ఇందులో వేసి పూడ్చి పెడుతుంటారు. 2022 మహజాతరలో సుమారు 3లక్షల మేకలు, గొర్రెలు, కోళ్ల తెగినట్లుగా అంచనా. వీటి వ్యర్థాలన్నీ కూడా భూమిలో పూడ్చేశారు. ఇక ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లతో పాటు ఇతర ప్లాస్టిక్ సంబంధించిన చెత్తను కాల్చి వేస్తుంటారు. దీంతో జంతువుల వ్యర్థాలను పూడ్చి వేసిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు కాలుష్యం కాటుకు గురవుతున్నాయి.


మేడారంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు

గాజు సీసాలతో ప్రమాదం

మహజాతరలో పోగవుతున్న ప్లాస్టిక్‌తో భారీ ముప్పు వాటిల్లుతుందనే భయాందోళనలు ఉన్నాయి. నిపుణుల అంచనా ప్రకారం పాలిథిన్ కవర్ నుంచి పీవీసీ పైపుల వరకు గత జాతరలో 1,021 టన్నుల ప్లాస్టిక్ చెత్త ఇక్కడ చేరినట్లుగా గుర్తించారు. ఇందులో సన్న ప్లాస్టిక్ కవర్ల వాటా ఏకంగా 200టన్నులుగా నమోదైనట్లుగా సమాచారం. సుమారు 2వేల మందికి పైగా పారిశుధ్య కార్మికులు శ్రమించినప్పటికీ జాతర ప్రాంతంలోని పొలాల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. డంపింగ్ యార్డుల్లో నిల్వచేసిన చెత్త నుంచి ప్లాస్టిక్ కవర్లు గాలిలో కొట్టుకపోయి అడవుల్లో పరుచుకుంటున్నాయి. ఇలా అడవుల్లో, పొలాల్లో కనిపించే ప్లాస్టిక్‌ను తినటం వల్ల పశువులు, ఇతర జంతువులు అనారోగ్యం పాలవుతున్నట్లుగా అధికారులు గుర్తిస్తున్నారు. డంపింగ్ యార్డుల్లో నిల్వ చేసిన ప్లాస్టిక్‌ను మండించటం వల్ల ఏర్పడే పొగతో అడవుల్లో ఉండే జంతువులు, పక్షులపై ప్రభావం పడుతున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు మేడారం మహజాతరలో మద్యం ఏరులైపారుతోంది. జాతర ముగిసిన తరువాత లక్షల్లో గాజు మద్యం బాటిళ్ల దర్శనమిస్తాయి. మహజాతరలో పోగవుతున్న వ్యర్థాల్లో సుమారు 100టన్నులకుపైగా బాటిళ్ల వ్యర్థాలే ఉన్నట్లుగా అధికారులు లెక్కలు వేస్తున్నారు. వీటిలో 50శాతం వరకు బాటిళ్ల రీసైక్లింగ్ అవుతుండగా, మిగతా 50శాతానికిపైగా బాటిళ్ల జాతర అవరణలో పగిలిపోతున్నాయి. ఇలా జాతర జరిగే ప్రాంతాల్లో గాజు పెంకులు ఉండటం వలన పొలాల్లోకి వెళ్లే రైతులకు, కూలీలకు, పశువులకు గాయాలు చేస్తున్నాయి.

ప్రచారమేనా.. ఆచరణేది..?

ఫ్రీ ప్లాస్టిక్ మేడారం జాతరగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతీ జాతర ముందు ఇలాగే ప్రచారం చేయడం.. జాతర సమయంలో ప్లాస్టిక్ రాకుండా ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా చేతులు ఎత్తివేయటం అనవాయితీగా వస్తోందనే విమర్శలున్నాయి. ప్లాస్టిక్ కవర్లకు బదులు పేపర్ బ్యాగులు, జనుప సంచులను వినియోగించేలా భక్తులకు అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే జాతరలో ప్లాస్టిక్ విక్రయించే షాపులపై దాడులు నిర్వహించకుండా ఎలా ప్లాస్టిక్‌ను అరికడతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చిత్తశుద్ధితో ప్లాస్టిక్‌ను అరికట్టకుంటే మేడారంలోని భావితరాలకు భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాతరంతా చెత్తనే..

మేడారం మహజాతర జరిగే నాలుగు రోజుల్లోనే 2వేల టన్నులకు పైగా చెత్త పోగవుతుంది. 2022 మహజాతరలో చెత్త భారీగా పోగైంది. జాతర జరిగిన ఆ నాలుగు రోజుల్లో 2,600టన్నుల చెత్తను గుర్తించగా, ఇందులో 1,021టన్నులు ప్లాస్టిక్, 420టన్నులకు పైగా జంతు వ్యర్థాలు పోగైనట్లుగా అధికారులు గుర్తించారు. మిగతా చెత్తలో భూమిలో తేలికగా కలిసిపోయే బియ్యం, బెల్లం, కొబ్బరి, ఆహారవ్యర్థాలు తదితరాలు ఉన్నాయి. 52శాతం భూమిలో కలిసి పోయే చెత్త ఉండగా, ఇక భూమిలో తేలికగా కలిసిపోని ప్లాస్టిక్ 48శాతం వరకు ఉంది. వందల ఏళ్ల వరకు కూడా భూమిలో కలిసిపోలేని ప్లాస్టిక్ ప్రతీ జాతర సందర్భంగా మేడారం పరిసరాల్లో పోగవుతోంది. పచ్చని అడవుల్లో భూమిలో కలిసిపోయిన ప్లాస్టిక్‌తో భవిష్యత్తులో భారీ నష్టాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతోంది.




వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



భక్తజన సంద్రంగా మేడారం

- తల్లుల దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- వందల వాహనాలతో నిండిపోయిన పార్కింగ్‌లు

మేడారం, ఫిబ్రవరి 18: వనదేవతలు సమ్మక్క,సారలమ్మలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. మహజాతరకు ముందే తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలువు కావడంతోపాటు మహజాతరకు మరో రెండు రోజుల సమయం ఉండడంతో తెలంగాణ నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు మేడారం తరలివచ్చారు. దీంతో గద్దెల ప్రాంగణం అమ్మవార్ల నామస్మరణతో మార్మోగింది. రద్దీ అధికంగా ఉండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ, పోలీసు శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్రమ పద్ధతిలో క్యూలైన్ల ద్వారా భక్తులు అమ్మవార్ల గద్దెలను సులభంగా దర్శించుకొని వెళ్లేలా పోలీసు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆదివారం 10 లక్షల మందికిపైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.


వనదేవతలను దర్శించుకునేందుకు వెళ్తున్న శివసత్తి

కిటకిటలాడిన పార్కింగ్ స్థలాలు

మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలివచ్చిన లక్షల మంది భక్తుల వేల సంఖ్యలో వాహనాలను పోలీసు అధికారులు పార్కింగ్ స్థలాలకు తరలించారు. పస్రా, నార్లాపూర్,

మిగతా 7వ పేజీలో..

నేడు మేడారంలో మంత్రుల పర్యటన

మేడారంలో రాష్ట్ర రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం పర్యటించనున్నారు. భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించనున్నారు. ఆయా శాఖల అధికారులతో సమావేశమై జాతర నిర్వహణపై సమీక్షించనున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం పరిశీలించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.


భూపాలపల్లిలోని బీసీకాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అభివృద్దే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాకతీయఖని, ఫిబ్రవరి 18: అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణ పరిధిలోని పుల్లూరు రామయ్యపల్లిలో రూ.29 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనుల నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షల వ్యయంతో మంజూర్ నగర్ సమీపంలోని బీసీకాలనీలో సీసీరోడ్డుకు, రూ.25 లక్షల వ్యయంతో రెడ్డికాలనీలో చేపట్టనున్న సైడ్ డ్రెయినేజీ, సీసీ రోడ్డుకు, రూ.25లక్షల వ్యయంతో తహసీల్దార్ కార్యాలయం వెళ్లే మార్గంలో సీసీ రోడ్డుకు, రూ.25లక్షలతో రాంనగర్ కాలనీలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని భూపాలపల్లి పట్టణంతోపాటు అన్ని గ్రామాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అప్పం కిషన్ యాదవ్, సాంబమూర్తి, రంజిత్, రజినీకాంత్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు డీఏలు చెల్లించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 18 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం మండల కేంద్రంలో గొప్ప సమ్మారావు అధ్యక్షతన ఆదివారం జరగ్గా ముఖ్యఅతిథిగా సోమశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.



టీఎస్‌యూటీఎఫ్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్

జిల్లా అధ్యక్షుడిగా సమ్మయ్య

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొడెం సమ్మయ్య ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా సమ్మారావు కొనసాగగా ఆయన స్థానంలో కొత్తగా సమ్మయ్యను ఎన్నుకున్నారు. సమ్మయ్య కోశాధికారిగా కొనసాగగా ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన స్థానంలో కోశాధికారిగా ఎం.వెంకటస్వామిని ఎన్నుకున్నారు. టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన్ కుమార్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వాసుదేవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జె. వెంకటస్వామి, జిల్లా కార్యదర్శులు కొండ చెంచయ్య, ఎస్. పాపారావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సారెస్పీ కాలువలో పడి చిన్నారి మృతి

కేసముద్రం, ఫిబ్రవరి 18 : మండలంలోని తౌర్యతండా జీపీ పరిధిలోని మూలస్తంభం వద్ద ఎస్సారెస్పీ కాలువలో నాలుగేళ్ల చిన్నారి మృతదేహన్ని స్థానికులు ఆదివారం సాయంత్రం గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం. సిద్దిపేట జిల్లా లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన గారడీ ప్రదర్శనలు చేసుకుని జీవించే సమాని రవి-సంధ్య దంపతుల కుమార్తె సంజన (4) పర్వతగిరి మండలం ఇస్లావత్‌తండా సమీపంలో ఎస్సారెస్పీ కాలువలో పడినట్లు తెలిపారు. అక్కడ్నుంచి నీటిలో కొట్టుకు వస్తున్న మృతదేహన్ని మూలస్తంభం వద్ద స్థానికులు గుర్తించి, వెలికి తీశారు. రెండు గారడీ కుటుంబాలు ఆదివారం ఉదయం ఇస్లావత్‌తండాకు చేరుకుని రాత్రి ప్రదర్శన నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.


సంజన మృతదేహం

ఈ క్రమంలో మధ్యాహ్నం 3.30 గంటలకు సంజన కన్పించడంలేదంటూ డయల్ 100కు తండవాసులు ఫోన్ చేశారు. ఈ మేరకు సంజన అచూకీ కోసం వెతుకుతుండగా కాలువలో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. ఆ చిన్నారి కాలువలో ఎలా పడిందన్న విషయంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా బాలికను గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై కిడ్నాప్ చేసి, ఎత్తుకెళ్లి కాలువలో పడేసినట్లు ఇస్లావత్‌తండాలో ప్రచారం జరిగింది.

నేటి నుంచి లక్నవరం సందర్శన బంద్



గోవిందరావుపేట, ఫిబ్రవరి 18: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పర్యాటక కేంద్రం లక్నవరం సరస్సు సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరను పురస్కరించుకుని ఈనెల 19 నుంచి 26 వరకు బంద్ చేయనున్నామని, పర్యటకులు ఎవరూ రావద్దని పస్రా ఎస్సై షేక్ మస్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహజాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఈ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

రామప్ప ఆలయంలో సందడి

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 18: మండలంలోని ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో సందడి నెలకొంది. మేడారం మహ జాతరను పురస్కరించుకుని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మేడారం వచ్చిన భక్తులు తిరుప్రయాణంలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడికి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడిని దర్శించుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం దేవాలయంలోని శిల్పకళా సంపదను వీక్షించి ఆలయ చరిత్ర గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రామప్ప దేవాలయాన్ని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. వారాంత సెలవు కావడంతో ఆలయాన్ని సందర్శించి సందడి చేశారు. అలాగే పలువురు విదేశీయులు కూడా పర్యటించారు.


రామప్ప ఆలయ ఆవరణలో విదేశీయులు


త్రివేణి సంగమంలో భక్తుల సందడి

గోదావరి తీరంలో కోలాహలం

మహదేవపూర్, ఫిబ్రవరి 18: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

మినీ జాతర ఏర్పాట్లు పూర్తి

మొక్కులు చెల్లించుకోనున్న సుమారు 2 లక్షల మంది

చిట్యాల, ఫిబ్రవరి 18: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని వెంచరామి శివారు పూరేడుగుట్ట మినీ మేడారం జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరో మూడు రోజుల్లో ప్రారంభమయ్యే ఈ జాతరకు మండలంతోపాటు టేకుమట్ల, పెద్దపల్లి జిల్లా మంథని, ముత్తారం తదితర మండలాల నుంచి సుమారు 2లక్షల మంది భక్తులు తరలివస్తారు. సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. ఏర్పాట్లలో భాగంగా జాతర ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గద్దెల చుట్టూ కంచెలు ఏర్పాటు చేశారు. కొబ్బరికాయలు, బెల్లం, లడ్డు ప్రసాదం, ఏకుడుపాలాలు, తదితర సరుకుల దుకాణాలకు టెండర్లు ఇప్పటికే పూర్తయ్యాయని జాతర కమిటీ అధ్యక్షుడు మల్లారపు మురళి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, స్నాన ఘట్టాలు, పార్కింగ్, విద్యుద్దీపాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. జాతరలో చిట్యాల సీఐ వేణుచందర్, ఎస్సైలు రమేష్, షాఖాన్ నేతృత్వంలో బందోబస్తును నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర ప్రాంగణంలో నాలుగు రోజులపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.. పరకాల నుంచి పూరేడుగుట్ట జాతర ప్రాంగణం వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు ఉంటాయని చెప్పారు.

నాలుగు రోజులపాటు..

పూరేడుగుట్ట జాతర ఈనెల 21న ప్రారంభమవుతుంది. తొలిరోజు ఒడేడు నుంచి సారలమ్మ కుంకుమ గద్దెపైకి చేరుకుంటుంది. 22న పూరేడుగుట్ట పైనుంచి గద్దెలపై సమ్మక్క కొలువుదీరుతుంది. 23న మొక్కులు ఉంటాయి, 24న దేవతలు వనప్రవేశం ఉంటుంది. జాతరలో సమ్మక్క పూజారులు గొగ్గల ప్రవీణ్, పొత్తపెల్లి సాంబయ్య, పోలం నర్సయ్య, సారలమ్మ పూజారి సార్ల ఓదెలు, లక్ష్మీదేవర పూజారి కూనం స్వామి కీలకంగా వ్యవహరించనున్నారు.



పూరేడుగుట్ట సమ్మక్క సారలమ్మ కొలువుదీరనున్న గద్దెలు

రూ. 31 లక్షలతో అభివృద్ధి పనులు

పూరేడుగుట్ట జాతరకు ప్రభుత్వం రూ. 31 లక్షలు కేటాయించింది. గతంలో సుమారు రూ. 6 లక్షలు మాత్రమే వెచ్చించేది. దీంతో అరకొర సౌకర్యాలతోనే జాతర ముగిసేది. ఈసారి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు 50 రోజుల ముందుగానే కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి పూరేడుగుట్ట జాతర ప్రాంతాన్ని సందర్శించారు. మినీ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో ఈ జాతరకు రూ.31లక్షలు కేటాయించారు. వెంచరామి శివారు కుర్మపల్లి నుంచి సుమారు 2.5 కిలోమీటర్ల మేరకు మట్టిరోడ్డు నిర్మించారు. జాతర ప్రాంగణంలో నాలుగు ఐమాక్స్ లైట్లు బిగించారు. తాగునీరు, స్నానాల కోసం నాలుగు బోరు మోటారు, పైపులైన్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలికంగా గదులు ఏర్పాటు చేశారు.

శాశ్వత పనులు చేపట్టాలి

- మల్లారపు మురళి, పూరేడుగుట్ట జాతర కమిటీ అధ్యక్షుడు



పూరేడుగుట్ట మినీ జాతకు శాశ్వత పనులు చేపట్టేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి. వెంచరామి శివారు నుంచి పూరేడుగుట్ట వరకు బీటీ రోడ్డును నిర్మించాలి. జాతర ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మించాలి. ప్రతి జాతరకూ భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా శాశ్వత పనులు చేపట్టాలి.



యునెస్కో గుర్తింపు వచ్చేనా?

- మేడారం జాతరకు అర్హత ఉందంటున్న నిపుణులు
- కొంత కృషి చేసిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్
- యునెస్కో గుర్తింపు లభిస్తే జాతరకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర అనేక విశిష్టతలతో కూడిన సమాహారం. అక్కడ దేవాలయం ఉండదు. మారుమూల దట్టమైన అడవి మధ్యలో ప్రకృతి ఒడిలో కేవలం గద్దెలపైన కుంకుమ భరిణ రూపంలో సమ్మక్క - సారలమ్మ తల్లులు ఉంటారు. లక్షలాది మంది భక్తులు వచ్చి తల్లులను కొలుస్తారు. వనదేవతలపై భక్తుల్లో ఉన్న ప్రగాఢ నమ్మకానికి ప్రతీక ఈ జాతర. ఈ పరంపర కొన్ని వందల ఏళ్ల నుంచి వస్తోంది. ఇన్ని లక్షల మంది రెండేళ్లకు ఒక సారి వస్తున్నారంటే దీని వెనుక ఏదో అతీతమైన అద్భుత శక్తి ఉందనుకోవాలి. ఈ కోణం నుంచే జాతర విశిష్టత, వైవిధ్యాన్ని ఎత్తి చూపడం ద్వారా యునెస్కో గుర్తింపునకు కృషిచేయాలి. ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాల్సి ఉంటుంది.

హనుమకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : విశిష్టమైన చారిత్రక నేపథ్యం కలిగిన సమ్మక్క-సారలమ్మ జాతరకు యునెస్కో గుర్తింపు లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వం తలుచుకుంటే రామప్పకు మాదిరిగానే ఈ జాతరను కూడా ప్రపంచవారసత్వ సంపద జాబితాలో చేరేట్టు చేయడం అసాధ్యమేమీ కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు కోటిమందికిపైగా హాజరవుతుండడంతో ఇప్పటికే ప్రపంచం దృష్టిని ఆకర్శించినందువల్ల యునెస్కోను ఒప్పించడానికి వీలున్నదంటున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర పూర్తిగా ప్రకృతితో మమేకమై జరిగే గిరిజన పండుగ ఇది ఇంటాంజియబుల్ హెరిటేజ్ కేటగిరి కిందకు వస్తుంది. ఈ నేపథ్యంలో మేడారం జాతరకు కూడా యునెస్కో వారసత్వ హోదా లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికే కొంత కృషి

జాతర వైశిష్ట్యాన్ని ప్రపంచానికి తెలియచేయడానికి కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఇప్పటికే చాలా కృషి చేసింది. జాతరపై ఇంగ్లీష్, తెలుగు భాషల్లో కాఫీ టేబుల్ బుక్‌ను ముద్రించింది. జాతరపై సమగ్ర సమాచారంతో కూడిన పుస్తకాన్ని ప్రచురించింది. జాతర గొప్పతానాన్ని ప్రతిబింబించేలా డాక్యుమెంటేషన్ కూడా చేసింది. అయితే రామప్పలాగా డోసియర్ తయారు చేయాల్సి ఉంది. ఇందుకు చాలా ఖర్చవుతుంది. ఎంతో మంది ఇందులో భాగస్వాములు కావలసి ఉంటుంది. జాతరకు సంబంధించిన ఏ చిన్న అంశం విడిచి పెట్టకుండా అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగునున్న దృష్ట్యా యునెస్కో గుర్తింపు కోసం ప్రయత్నాలను మొదలు పెడితే రామప్పకు తరహాలో మేడారం జాతరకు కూడా యునెస్కో గుర్తింపు లభించగలదన్న విశ్వాసంతో భక్తులు ఉన్నారు.



నిపుణులతో కమిటీ

జాతరకు యునెస్కో గుర్తింపు సాధించడానికి అవసరమైన ప్రాతిపదిక సౌకర్యాలను కల్పించాలి. పూర్వానుభవం కలిగిన తగిన వ్యక్తులను ఎంపిక చేసి వారితో కేంద్ర పురావస్తుశాఖ, రాష్ట్ర పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ, ఇతర సాంకేతిక విభాగాలలో నిష్ణాతులైన వారితో ఒక కమిటీని వేయాలి. ఈ మేరకు ఒక డోసియర్‌ను తయారు చేయాలి. ముందు టెంటెటివ్ లిస్టులోకి వెళ్లాలి. అప్పుడే యునెస్కోలో పరిధిలోకి జాతరను తీసుకు వెళ్లడానికి మంచి అవకాశాలుంటాయి.

క్రైటేరియాను గుర్తించాలి

యునెస్కోలో గుర్తింపునకు ముందు క్రైటేరియాను గుర్తిచాలి. యునెస్కో గైడ్‌లైన్స్ చాలా సంక్లిష్టంగా ఉంటాయి. ఇంటాంజియల్ హెరిటేజ్‌గా పరిగణించే సమ్మక్క-సారలమ్మ జాతర యునెస్కోలో ఏ గైడ్‌లైన్స్‌కు కిందికి వస్తుందో గుర్తించాలి. రామప్ప దేవాలయం విషయంలో గైడ్‌లైన్స్‌లో ఒకటి, మూడు తీసుకున్నారు. అలాగే మేడారం జాతర విషయంలో కూడా గైడ్‌లైన్స్‌ను చాలా జాగ్రత్తగా గుర్తించాలి. ఆ మేరకు సమగ్ర సమాచారంతో కూడిన డోసియర్‌ను తయారు చేయాలి. జాతరకు యునెస్కో గుర్తింపు లభించినట్లయితే ప్రత్యేకంగా నిధులంటూ ఏమీ రాకపోయినా బ్రహ్మాండమైన అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది. ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తారు. యునెస్కో గుర్తింపువల్ల గిరిజన జాతరపై పరంపరపై ఎలాంటి ప్రతికూల ప్రభావమూ పడదు, జాతర సంప్రదాయాలు యథావిధిగా కొనసాగుతాయి. జాతర నిర్వహణలో ఎలాంటి మార్పు ఉండదు.

డోసియర్ కీలకం


మేడారం జాతరను యునెస్కో పరిధిలోకి తీసుకురావాలంటే ముందు సమగ్రమైన డోసియర్‌ను రూపొందించాలి. ఇదేకీలకం. దీనినిబట్టే గుర్తింపు లభిస్తుంది. డోసియర్ తయారు చేయడం అంత సులభం కాదు. ఇందుకు చాలా కసరత్తు చేయాల్సి ఉంటుంది. అనేకమంది నిపుణులను భాగస్వాము లను చేయాల్సి ఉంటుంది. రామప్ప విషయంలో ఇలాగే జరిగింది. డోసియర్ తయారు చేయడానికి చాలాఏళ్ల పట్టింది. పైగా ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకుండా డోసియర్‌ను తయారు చేయడం కష్టం.

యునెస్కో గుర్తింపు సాధ్యమే

రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్



మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు లభించేలా చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. రామప్పలాగా ఈ గిరిజన జాతరపై డోసియర్ తయారు చేయాలి. ఏ క్రైటేరియా కిందకు దీనిని తీసుకురావాలో నిర్ధారించాలి. అందుకు ప్రాతిపదికను రూపొందించాలి. లోతుగా పరిశోధన జరపాలి. జాతర విశేషాలను, ప్రత్యేకతలను అన్ని కోణాల నుంచి రికార్డు చేయాలి. ఇందుకు ప్రత్యేక కమిటీలను వేయాలి. మేడారం జాతరపై కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ పక్షాన అద్భుతమైన ఛాయాచిత్రాలు, సమ్రగ సమాచారంతో కూడిన కాఫీ టేబుల్ బుక్‌ను తెలుగు, ఇంగ్లీష్ బాషల్లో ఇది వరకే తీసుకు వచ్చాం. జాతర చరిత్రను తెలిపే పుస్తకాన్ని కూడా ముద్రించాం. మేడారం జాతరకు యునెస్కో గుర్తింపు దిశగా కొంత పని అయితే ప్రాథమికంగా చేశాం. ఈ జాతర ఇంటాంజియల్ హెరిటేజ్ లేదా లివింగ్ హెరిటేజ్ కిందకు వస్తుంది. సమ్మక్క - సారలమ్మ జాతర ఈ నేలపై పరిడవిల్లుతున్న ఒక ఆదివాసీ ప్రాచీన సాంస్కృతిక సజీవ వారసత్వ సంపద. ఈ కోణం నుంచి సరిగా ప్రాజెక్టు చేయగలిగితే జాతరకు యునెస్కో గుర్తింపు లభించడం సాధ్యమే.












మేడారం రూట్ మ్యాప్



మేడారానికి దారి అదిగో..

ములుగు, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు చేరుకునేందుకు జిల్లా పోలీసు శాఖ రూట్ మ్యాప్‌ను విడుదల చేసింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈసారి కూడా వన్‌వే అమలు చేస్తున్నారు. ఆర్టీసీ, వీవీఐపీ, వీఐపీ వాహనాలను తాడ్వాయి మీదుగా మేడారం అనుమతిస్తుండగా ప్రైవేటు వాహనాలకు మేడారం నలువైపులా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆయా రూట్లలో వచ్చే వాహనాలు నిలిపేందుకు సుమారు 1,500 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను పోలీసులు ఏర్పాటు చేశారు. అక్కడ లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు.

- వరంగల్ వైపు నుంచి మేడారం వెళ్లే వాహనదారులు హనుమకొండ, గూడెప్పాడ్, ములుగు, పస్రా, నార్లాపూర్ మీదుగా మేడారం చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో బయ్యక్కపేట, కమలాపురం క్రాస్‌రోడ్డు, పరకాల, గూడెప్పాడు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- మహారాష్ట్ర, రామగుండం నుంచి వచ్చే వాహనదారులు కాటారం, చింతకాని, యామన్‌పల్లి, పెగడపల్లి, కాల్వపల్లి మీదుగా మేడారం చేరుకోవాలి. అదే దారిలో తిరుగు ప్రయాణం చేయాల్సి ఉంటుంది
- ఛత్తీస్‌గఢ్, భద్రాచలం, కొత్తగూడెం నుంచి వచ్చేవారు ముల్లకట్ట, ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి, దొడ్ల, కొండాయి మీదుగా ఊరట్టం నుంచి మేడారం చేరుకోవాలి. ఇదే దారిలో తిరుగు ప్రయాణం చేయాలి.

పగిడిద్దరాజు ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- ఈ ఏడాది అధికారిక లాంఛనాలతో స్వామి వారిని మేడారానికి తీసుకెళ్తాం..
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



పగిడిద్దరాజు ఆలయంలో స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి సీతక్క

గంగారం(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 : గిరిజనుల ఆరాధ్య దైవం.. సమ్మక్క పెనిమిటి పగిడిద్దరాజు ఆలయాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైయున్న పగిడిద్దరాజు ఆలయంలో ఆదివారం మేడారం సమ్మక్క, సార్లమ్మ ఆలయం బోర్డు చైర్మన్ లచ్చు పటేల్ ద్వారా స్వామి వారికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలను ప్రధాన తలపతి(అర్చకుడు) పెనక రాజేశ్వర్‌కు అందచేశారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తలపతులకు పట్టు వస్త్రాలను ఇచ్చి, సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మారుమూలన ఉన్న పగిడిద్దరాజు ఆలయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. భక్తులకు అవసరమైన మంచినీటి వసతి యుద్ధప్రాతిపదికంగా ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ ఏఈ నరేష్‌ను ఆదేశించారు. భగీరథ నుంచి నీరు రానిపక్షంలో బోరు బావులనుంచైనా ఆలయానికి మంచినీరు వసతి ఏర్పాటు చేయాలన్నారు. పగిడిద్దరాజు ఉండే వనం గుట్టకు ఇనుప కంచె ఏర్పాటు చేస్తానన్నారు. వనం వరకు సీసీ రోడ్డుకాని బీటీ రోడ్డు కానీ ఏర్పాటు చేస్తానన్నారు.

ఈ ఏడాది పగిడిద్దరాజుని పెండ్లి కుమారుడిగా అధికార లాంచనాలతో సమ్మక్క గద్దెకు తీసుకు వెళ్తామని ధనసరి సీతక్క తెలిపారు. మరుగుదొడ్లు మరమతులు చేయటమే కాకుండా, ఆలయం ప్రాంగణంలో భక్తులు ఉండేలా షెడ్లు, వంటగదులు నిర్మాణం చేస్తామన్నారు. పూనుగొండ్ల నుంచి దుబ్బగూడెం వరకు రహదారి, పూనుగొండ్ల నుంచి కరుణగండి మీదుగా కొత్తగూడకు బీటీ రోడ్డు ఏర్పాటుకు చేయాలని గిరిజనులు వినతి పత్రమిచ్చారు. చివరిగా మంత్రి సీతక్కకు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు శాలువాతో సత్కరించారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారి గంగారం మండలం రావటంతో పూనుగొండ్ల ఆడబిడ్డలతో కాసేపు ముచ్చటించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా మీ ఇంటి బిడ్డగా తనతో చెప్పుకోవాలని కోరారు. వివిధ సమస్యల వినతి పత్రాలు స్వీకరించారు. పదేళ్ల నుంచి రెండో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నాము తమకు రెగ్యులర్ చేయాల ని కోరుతూ స్థానిక ఏఎన్ఎంలు వినతి పత్రాలను ఇచ్చారు.

కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, డీడీ మంకిడి ఎర్రయ్య, డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బానోత్ రాజునాయక్ గంగారం ఎస్ఐ దిలీప్, ఐటీడీఏ ఏఈ రవి, ఎంపీపీ సువర్ణపాక సరోజన, జడ్పీటీసీ ఈసం రమ, వైస్ ఎంపీపీ సువర్ణపాక సరోజన, వజ్జా సారయ్య, చల్లా నారాయణ రెడ్డి, పగిడిద్దరాజు ఆలయ తలపతులు పెనక రాజేశ్వర్, పురుషోత్తం, రామస్వామి, సురేందర్, లక్ష్మీనర్సు పాల్గొన్నారు.



ఆలయంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలకు పూజలు చేస్తున్న సీతక్క

సేవాభావంతో విధులు నిర్వర్తించాలి

- మేడారం జాతర విధుల్లో 15వేల మంది సిబ్బంది
- టీఎస్ ఆర్‌టీసీ ఎమ్డీ వీసీ సజ్జనార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎమ్డీ సజ్జనార్

సుబేదారి, ఫిబ్రవరి 18 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో ఆర్టీసీ సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తించాలని టీఎస్‌ఆర్‌టీసీ ఎం.డి. వీసీ సజ్జనార్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఆరెపల్లి అయ్యప్ప టెంపుల్ సమీపంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ (జెడ్‌ఎస్టీసీ)లో ఆదివారం మేడారం జాతర నిర్వహణపై టీఎస్‌ఆర్‌టీసీ సిబ్బంది, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్డీ సజ్జనార్ హాజరై మాట్లాడారు. మేడారం జారతలో సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించి భక్తులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలన్నారు. భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో సిబ్బందికి కేటాయించిన స్థానాలలో మాత్రమే విధులు నిర్వహించేలా అధికారులు చూడాలని సూచించారు. భక్తులకు నిస్వార్థమైన సేవలు అందించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని, సిబ్బంది దీనిని ఒక చాలెంజ్‌గా తీసుకుని జాతరలో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలన్నారు. జీరోఫెయిలూర్స్‌తోపాటు యాక్సిడెంట్ ఫ్రీగా జాతర జరిగేలా ప్రతీ ఒక్క సిబ్బంది కృషి చేయాలన్నారు. మేడారం జాతరలో 15వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తించాలని, వారికి వసతి సౌకర్యం, భోజనం విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులకు సజ్జనార్ సూచించారు.

ఈ సందర్భంగా మేడారం జాతరలో విధులు నిర్వర్తించే ఆర్టీసీ సిబ్బంది కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూపొందించిన టీషర్టులను సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీఎస్ ఆర్‌టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, రఘునాథరావు, వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తజన సంద్రంగా మేడారం




వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, జంపన్నవాగులోని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానమాచరిస్తున్న భక్తులు

(5వ పేజీ తరువాయి)

కాల్వపల్లి, బయ్యక్కపేట, ఊరట్టం, తాడ్వాయి గ్రామాల మీదుగా వచ్చిన వాహనాలను గద్దెలకు సమీపంలోని పార్కింగ్ స్థలాలకు తరలించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. దీంతో పార్కింగ్ స్థలాలు కిటకిటలాడాయి.

మేడారం చేరుకున్న లక్నవరం నీరు

గోవిందరరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు నీరు మేడారానికి చేరుకుంది. మహా జాతర సందర్భంగా ఈ నెల 13న ఇరిగేషన్ అధికారులు లక్నవరం నుంచి నీటిని విడుదల చేశారు. మేడారం జంట వంతెల వరకు నీరు ఆదివారం సాయంత్రం చేరుకుంది.

రేపు గద్దెకు జంపన్న రాక

మేడారం మహాజాతరలో భాగంగా గద్దెకు జంపన్న మంగళవారం చేరుకోనున్నారు. కన్నెపల్లి నుంచి పూజారి పోలెబోయిన సత్యం వారసులు జంపన్నను అంగరంగ వైభవంగా తీసుకొస్తారు. జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. ఈనెల 24న తిరిగి వనప్రవేశం చేయిస్తారు. ప్రభుత్వ లాంచనాలతో ఈనెల 21, 22 తేదీల్లో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెకు చేరనున్నారు.



కోడితో మొక్కు చెల్లించుకుంటున్న భక్తురాలు

తాడ్వాయిలో పార్కింగ్ స్థలాలు సిద్ధం

తాడ్వాయి, ఫిబ్రవరి 18: ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని మేడారం వచ్చే భక్తుల సౌకర్యార్థం తాడ్వాయి మండలకేంద్రంలో ఆర్టీసీ, పార్కింగ్ స్థలాలు సిద్ధమయ్యాయి. జాతరకు ఆర్టీసీ సుమారు 6వేల బస్సులను నడిపిస్తుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకుగాను బస్సులు నిలిపేందుకు తాడ్వాయిలోని జిన్నెలచెరువుతోగు వద్ద ఒకటి, కామారం గొత్తికోయగూడెం సమీపంలో మరొకటి, మండలకేంద్రంలోని మేడారం ప్రధాన ద్వారం సమీపంలో స్థలాలను ఏర్పాటు చేశారు. మేడారం వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో ఈస్థలాల్లో బస్సులను నిలిపి టికెట్లు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇబ్బందులు తలెత్తినప్పుడు ఈస్థలాల్లో బస్సులను నిలుపుదల చేసి టికెట్లు ఇవ్వడంతోపాటు బస్సులు అకస్మాత్తుగా మరమ్మతుకు గురైతే వెంటనే వాటిని ఈ ప్రదేశానికి తరలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ భక్తులు మేడారం అమ్మవార్లను దర్శించుకుని సులువుగా వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు ముమ్మర యత్నాలు చేస్తున్నారు. దీంతోపాటు సుమారు వెయ్యి మందికి బస ఏర్పాట్లు, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మేడారం జాతర ప్రశాంతంగా జరిగేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.


తాడ్వాయిలో సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలం

ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన

మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఈనెల 21 నుంచి 24వతేదీ వరకు జరుగనుండగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మేడారంలో ఘన, ప్లాస్టిక్ వ్యర్థాలు, బయోమెడికల్ వ్యర్థాలపై భక్తులకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆదివారం మేడారంలోని కల్యాణకట్ట, ఇతర ప్రాంతాల్లో వరంగల్ టీఎస్‌పీసీబీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా డబ్బాలను ఏర్పాటుచేసింది. తలనీలాలు ఇచ్చే సమయంలో ఉపయోగించే బ్లేడ్‌లు, ఇతర వ్యర్థాలను సేకరించి బయోమెడికల్ వ్యర్థాలను పారవేసే సదుపాయం, తరలించే పనిపై సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. అంతేకాకుండా వ్యాధులు వ్యాప్తిచెందకుండా ప్రజారోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షించడానికి పీసీబీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తాడ్వాయి-మేడారం మధ్య పారిశుధ్య లోపం

మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని గత నెలరోజులుగా భక్తులు మేడారం చేరుకొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించి తిరుగు ప్రయాణమవుతన్నారు. ఇందులో భాగంగా తాడ్వాయి-మేడారం మార్గమధ్యంలో గల అడవిలో రహదారి వెంట చెట్లకింద, తాగునీటి పంపుల వద్ద విడిది చేసి జంతు కళేబరాలు, కుళ్లిన ఆహార పదార్థాలు, చెత్తాచెదారం వదిలివేస్తుం డడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులు సూచి స్తున్నప్పటికీ భక్తులు పట్టించుకోకుండా విరివిగా ప్లాస్టిక్ వస్తు వులను వాడుతూ ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా పడేస్తు న్నారు. దీంతో అటవీ జంతువులతోపాటు పశువులు వాటిని తిని అస్వస్థతకు గురై మృతిచెందే అవకాశం ఉందని తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు నిత్యం తాడ్వాయి-మేడారం రాకపోకలు సాగి స్తున్నప్పటికీ పారిశుధ్యాన్ని గమనించకపోవడంపై పలు ఆరో పణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ, ఫారెస్టు అధి కారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

మేడారంలో రోప్ పార్టీకి శిక్షణ


రోప్ పార్టీకి శిక్షణ ఇస్తున్న పోలీసు శాఖ అధికారులు

మేడారం, ఫిబ్రవరి 18: మేడార మేడారం మహాజాతర సందర్భంగా ఫిబ్రవరి 21న సారలమ్మ, 22న సమ్మక్క దేవతను గద్దెపై ప్రతిష్ఠించేందుకు తీసుకొచ్చే క్రమంలో రక్షణ కల్పించేందుకు ఎంపిక చేసిన రోప్ పార్టీ పోలీసులకు అదనపు ఎస్పీ సదానందం నేతృత్వంలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. తల్లులను తీసుకొచ్చే క్రమంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ సందర్భంగా పూజారులను తాకేందుకు భక్తులు పోటీపడుతుంటారు. దీంతో పూజారులు ఇబ్బందులకు గురవుతుంటారు. గత జాతర అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి సమస్యలు పునరావృతం కాకుండా తల్లులను గద్దెల పైకి చేర్చేందుకు పక్క ప్రణాళికలు సిద్ధం చేశారు. రోప్ పార్టీకి తగిన శిక్షణ ఇచ్చారు.

లోపించిన పారిశుధ్యం

మేడారం మహాజాతరలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు స్నానఘట్టాలపై 354 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఏర్పాటు చేశారు. ముందస్తుగా తరలి వస్తున్న లక్షల మంది భక్తులు వాగులోని ట్యాప్స్ కింద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో వాగులో స్నానఘట్టాల వద్ద పారిశుధయం లోపించింది. దీంతో ఆ పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. మహిళలు దుస్తులు మార్చుకునే గదుల్లో కూడా పారిశుధ్య సమస్యలు తలెత్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

దర్శనాలలో పోలీసుల వైఫల్యం

మేడారం మహాజాతరకు ముందుగానే తరలి వస్తున్న భక్తులకు దర్శనాలు కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని అభిప్రాయాలు వక్తమవుతున్నాయి. ప్రొటోకాల్ దర్శనాలకు కూడా వేచి చూడాల్సి వస్తోందని తెలుస్తోంది. గద్దెలకు రెండు వైపులా ఎంట్రీ, రెండు ఎక్జిట్ ద్వారాలు ఉన్నాయి. ప్రధాన గేటు నుంచి ప్రొటోకాల్ దర్శానాలు జరుగుతున్నాయి. మరో రెండు ద్వారాల నుంచి పూజారులు, వికలాంగులు, వృద్ధులు వెళ్లాల్సి ఉంది. తమ కుటుంబాలు, బంధుమిత్రులు, పరిచయస్థులను ఈ గేట్ల ద్వారా పలువురు పోలీసులు తీసుకెళ్లి ప్రత్యేక దర్శనాలు చేయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో సాధారణ భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎటు నుంచి వెళ్తే దర్శనాలు చేసుకోవచ్చో తెలియక భక్తులు అయోమయానికి గురవుతున్నారు. అంతేకాకుండా కొందరు పోలీసులు డబ్బులు తీసుకొని నేరుగా గద్దెలకు తీసుకువెళ్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దర్శనాలకు కేటగిరీల వారీగా విభజించి రూ. 500, రూ. వెయ్యి, రూ. 2 వేలు తీసుకొని ప్రొటోకాల్ దర్శనంలో భాగంగా కండువాలు కప్పించి నేరుగా తల్లుల గద్దెలపైకి తీసుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు.

బయ్యారంలో ఏటీఎం చోరీ

రూ. 29 లక్షల అపహరణ • అంతరాష్ట్ర దొంగలుగా అనుమానం

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఓ దొంగల ముఠా గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను పగలగొట్టి రూ. 29.78 లక్షల డబ్బును ఎత్తుకెళ్లింది. విషయం తెలుసుకున్న ఏఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం పోలీసులు ఆనవాళ్లను సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురు వ్యక్తులు కారులో వచ్చి బయ్యారం ఎస్బీఐ ఏటీఎం మిషన్‌కు కొంత దూరంలో ఆగారు. కొంతసేపు తర్వాత కారులో నుంచి ఓ వ్యక్తి దిగి ఏటీఎం వద్దకు వెళ్లి గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను పగలగొట్టాడు. అందులోని రూ.29.78 లక్షల నగదు అపహరించారు. చోరీ తీరును బట్టి అంతరాష్ట్ర ముఠాగా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు ఎస్సై తెలిపారు. క్లూస్ టీం ద్వారా ఆనవాళ్లు సేకరిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని వెల్లడించారు. బ్యాంకు సిబ్బంది, సీఎంఎస్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

నెవార్ బ్యాచ్ పనేనా..?!

బయ్యారం ఎస్బీఐ ఏటీఎం మిషన్‌లో జరిగిన చోరీ హర్యానాకు చెందిన నెవార్ బ్యాచ్ పనేనా.. ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాళం వేసిన ఇళ్లల్లో చడ్డీ గ్యాంగ్ చోరీకి పాల్పడుతున్న విధంగానే ఈ బ్యాచ్ కూడా ఏటీఎంలను మాత్రమే టార్గెట్ చేస్తూ దొంగతలనాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ బ్యాచ్ కొంత కాలంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని ఏటీఎంలను టార్గెట్ చేస్తూ చోరీకి పాల్పడుతన్నట్లు తెలుస్తోంది. ఒక ప్రాంతంలోని ఏటీఎంను ఎంచుకుంటున్న ఈ ముఠా సభ్యులు ముందుగా అక్కడ కొంత కాలం పాటు రెక్కీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సెల్ టవర్ సిగ్నల్స్‌కు కూడా దొరకకుండా ఫేక్ సిమ్‌లతో సంచరిస్తున్న ఈ ముఠా సభ్యులు చాలా జాగ్రత్తగా ఏటీఎంల చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక ఏటీఎంపై పూర్తిగా అవగాహనకు వచ్చిన తర్వాత గ్యాస్ కట్టర్ల సాయంతో మిషన్‌లోని నగదును అపహరిస్తున్నట్లు సమాచారం.


ధ్వంసం చేసిన ఏటీఎంను పరిశీలిస్తున్న క్లూస్‌టీం

బొగ్గు లారీలను అడ్డుకున్న రైతులు

మల్హర్, ఫిబ్రవరి 18 : బొగ్గు లారీలు నడవడం వల్ల రోడ్డుపై ఉన్న దుమ్మూధూళి వాలి ఎంటలు నష్టపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిచర్ల శివారులో బొగ్గు లారీలను ఆదివారం అడ్డుకొని నిరసన తెలిపారు. తాడిచర్ల శివారులోని ఎర్రగుంట పరిసర ప్రాంత రైతులు బొగ్గుల లారీల వల్ల పంటలు దెబ్బతింటున్నాయని రోడ్డుపై నీరు చల్లాలని పలుమార్లు ఓసీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీంతో పంటలపై దుమ్మూధూళి చేరి నష్టం వాటిల్లుతోందని అన్నారు. రైతులు నిరసనకు దిగారనే సమాచారం అందుకున్న ఓసీపీ అధికారులు, కొయ్యూర్ పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. దుమ్ము లేవకుండా రోడ్డుపై నీరు చల్లిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

మండల కేంద్రమైన తాడిచర్ల మీదుగా వివిధ క్వారీల నుంచి తరులుతున్న ఇసుక లారీలను తాడిచర్ల గ్రామస్థులు అడ్డుకున్నారు. ఆపై రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు. 15 రోజులుగా లారీలు తాడిచర్ల గ్రామం మీదుగా వెళ్తున్న ఏవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

జాతర పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 18: మొగుళ్లపల్లి-ములుకలపల్లి గ్రామాల మధ్య జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర పనులను ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే జాతరలో పూర్తిస్థాయి పనులు మంగళవారం పూర్తికావాలని జాతర కమిటీ సభ్యులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని, పారిశుధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు తక్కళ్లపల్లి రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కాటారం, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలో జరిగిన ఉమ్మడి అంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక డివిజన్ స్థాయి గారెపల్లి ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. రాత్రి జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత జట్లకు ట్రోఫీలు, నగదుబహుమతులు అందించారు. . ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పయనించకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని అన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. ఏప్రిల్‌లో తెలంగాణ స్థాయి క్రికెట్ టోర్నీ మినిస్టర్ కప్‌ను భారీ ప్రైజ్‌మనీతో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, అబ్దుల్ అజీజ్, యూత్ రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస్‌రావు, మం డల అధ్యక్షుడు చీమల సందీప్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రావు, అంగజాల అశోక్, నరేష్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, సుశీల్‌రావు తదితరులు పాల్గొన్నారు..


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న శ్రీనుబాబు

సాదా సీదాగా జడ్పీ సర్వసభ్య సమావేశం



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 18: భూపాలపల్లిలోని మునిసిపల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం సాదాసీదాగా జరిగింది. జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి అధ్యక్షతన దీన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్ పాల్గొన్నారు. సమావేశ ఎజెండాలో మొత్తం 31 అంశాలను చర్చించారు. ప్రధానంగా ఏడు శాఖలపైనే చర్చ కొనసాగింది. ఇందులో ఉద్యాన, వ్యవశాయ, విద్య, అర్‌డబ్ల్యూఎస్, పంచాయ తీరాజ్‌శాఖ, పశుసంవర్ధక, డీఆర్ డీఏ శాఖల పనితీరుపై చర్చ కొనసాగింది. ఉద్యానశాఖ చర్చ సమయంలో మహదేవపూర్, మహముత్తారం, భూపాలపల్లి జడ్పీటీసీలు గుడాల అరుణ, లింగమళ్ల శారద, కళ్లెపు శోభ మాట్లాడుతూ పామాయిల్ పంటపై అధికారులు పర్యవేక్షణ చేయడం లేదన్నారు. పంట వేయించే సమయంలో తీసుకునే శ్రద్ధ వాటి సంరక్షణలో లేదన్నారు. రైతులకు సూచనలు కరువయ్యాయన్నారు. పశుసంవర్ధక శాఖ సమీక్ష సమావేశంలో మొగుళ్లపల్లి జడ్పీటీసీ జోరుక సదయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా డీడీలు తీసిన వారికి యూనిట్లను అందిస్తారా.. లేదా..? అనే విషయాన్ని తెలియజేయాలన్నారు. టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ గొర్రెల పంపిణీలో ఎలాంటి లబ్ధి చేకూరింది.. పథకం పరిస్థితిని ప్రభుత్వానికి ఏమని నివేదించారని ప్రశ్నించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీదేవి కల్పించుకొని రెండో విడుత డీడీలు తీసిన విషయమై మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలతో నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఆ వెంటనే ఎమ్మెల్యే సత్యనారాయణరావు కల్పించుకొని డీడీలు తీసిన వారికి గొర్రెలను అందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని బదులిచ్చారు. అసెంబ్లీలో కూడా ఈ చర్చ జరిగిందన్నారు. కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. కనీసం అటెండర్ కూడా లేని పరిస్థితి ఉండేదన్నారు. వ్యవసాయ శాఖ సమీక్ష సమయంలో మల్హర్ ఎంపీపీ మల్హల్‌రావు మాట్లాడుతూ రైతుబంధు పథకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడతూఊ ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మహిళలకు ఫ్రీ బస్సు కల్పించామన్నారు. రూ.500 సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ప్రాసెస్ కొనసాగుతోందని తెలిపారు. రైతుబంధు ఇచ్చే విషయంపై త్వరలోనే సర్కారు స్పష్టత ఇస్తుందని తెలిపారు. రుణమాఫీ చేసే ఆలోచనలో కూడా ప్రభుత్వం చేస్తోందని వివరించారు.

ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, సీఈవో విజయలక్ష్మితో పాటు అయా మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. -

గత సర్కారుపై బీఆర్‌ఎస్ జడ్పీటీసీ ఆసక్తికర వ్యాఖ్యలు

జడ్పీ సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఆసక్తికర చర్చ సాగింది. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను బీఆర్‌ఎస్‌కు చెందిన టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి లేవనెత్తారు. బీఆర్‌ఎస్ సంక్షేమ ఫలాల్లో ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. గొర్రెల పంపిణీలో హైదరాబాద్‌లో ఉన్న వారికి కూడా యూనిట్లను అందించగా వారు అమ్ముకున్నారని విమర్శించారు. గుట్టలు, చెట్లకు కూడా రైతుబంధు ఇచ్చారని విమర్శించారు. ఇక రూ. 2 కోట్ల కట్నం ఇచ్చి వివాహాలు చేసిన వారికి కూడా కళ్యాణలక్ష్మి చెక్కులు వచ్చాయని, వాటిని కళ్లు మూసుకొని తామే పంపిణీ చేశామని అన్నారు. కేసీఆర్ తమను కలిసే అవకాశం ఇచ్చేది ఉంటే ఆయనకు ఈ విషయాలు చెప్పేవారమని అన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్న జడ్పీటీసీ గత ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేయడం సభలో ఆసక్తికరంగా మారింది.

రామప్ప ఆలయంలో క్యూలైన్ల ఏర్పాటు

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 18: ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో భక్తుల కోసం ఆదివారం క్యూలైన్లను ఏర్పాటు చేశారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రామలింగేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులు నేరుగా క్యూలైన్ల ద్వారా వెళ్లేందుకు ఈ చర్యలు చేపట్టారు. అదేవిధంగా పార్కింగ్ స్థలం, విద్యుత్, తాగునీరు, తదితర ఏర్పాట్లు చేశారు.

'వరంగల్ ఎంపీ టికెట్ వెంకటేశ్వర్లుకు ఇవ్వాలి'

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 18: వరంగల్ పార్లమెంట్ బీజేపీ టికెట్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లుకు ఇవ్వాలని తెలంగాణ మాల పోరాట సమితి(టీఎంపీఎస్) రాష్ట్ర కార్యదర్శి శ్రీరాముల పైడి కోరారు. మండలంలోని నర్సాపూర్‌లో ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు దండ్రె అనిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీఎంపీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు బీజేపీలో మూడేళ్లుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్న ఆయనకు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు శ్రీనివాస్, రమేష్, అనిల్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ స్వగ్రామంలో విషాదఛాయలు

వాజేడు, ఫిబ్రవరి 18: ములుగులో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ పొడెం కోటి స్వగ్రామం వాజేడు మండలం పెద్దగొల్లగూడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కోటితో ఉన్న అనుబంధాన్ని గ్రామస్థులు నెమరేసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని ఇంటెలిజెన్స్ సీఐలు హరికృష్ణ, తిరుపతి, వెంకటాపురం ఎస్సై అశోక్ పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడేమోశారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

టేకుమట్ల, ఫిబ్రవరి 18: ఈ నెల 21న ఎమ్మార్పీఎస్ వరంగల్ పార్లమెంట్ స్థాయి సమావేశానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని భూపాపలపల్లి జిల్లా అధ్యక్షుడు గాజుల బిక్షపతి కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రేణుకుంట్ల సంపత్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో బిక్షపతి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల పార్లమెంటరీ స్థాయి సమావేశం వరంగల్‌లో జరగనుందని దీన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు నోముల శ్రీనివాస్, దోర్నాల రాజేందర్, అంతడుపుల సురేష్, రాంచందర్, ఆకినపల్లి మల్లయ్య, రాం కుమారస్వామి, మచ్చ రాజయ్య, ఎలుకటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం ఎస్సైగా మహేందర్

మహాముత్తారం, ఫిబ్రవరి 18: మహాముత్తారం ఎస్సైగా మహేందర్ కుమార్ బాధ్యతలు ఆదివారం స్వీకరించారు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఆయనను ఇక్కడ బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న సుధాకర్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

ప్రశాంతంగా గిరిజన గురుకుల ప్రవేశ పరీక్ష

కాటారం, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా ప్రవేశాల కోసం కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగిందని, వంద మంది రాయాల్సి ఉండగా 99మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెంట్ శైలజారాణి తెలిపారు. సీఎస్‌గా శైలజారాణి వ్యవహరించగా డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎస్టీ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య వ్యవహరించారు.

నేటి నుంచి కాటారం-మేడారం బస్సులు

కాటారం, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని కాటారం-2 బస్టాండ్ నుంచి మేడారం మహాజాతరకు వెళ్లే భక్తుల కోసం భూపాలపల్లి డిపో ద్వారా బస్సులు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. 10 సర్వీసులను జాతర ప్రయాణి కుల కోసం అందుబాటులో ఉంచుతామని, రద్దీ పెరిగితే సంఖ్యను పెంచుతామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ పట్టివేత

టేకుమట్ల, ఫిబ్రవరి 18: మండలంలోని గర్మిల్లపల్లి శివారులోని మానేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను, ఒక్క టిప్పర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మొగుళ్లపల్లి, రేగొండ, భూపాలపల్లి మండలాలకు చెందిన పుట్టపాక దేవేందర్, మెట్టు రజానీకాంత్, నడిపెల్లి శ్రీనివాస్, కట్ల ప్రణయ్ ఎలాంటి అనుమతి లేకుండా మానేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మూడు వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కరువు : ఏబీవీపీ

చిట్యాల, ఫిబ్రవరి 18: మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించాల్సిన కోడిగుడ్లు, ఇతర సరుకులను కొంతమంది అంగన్‌వాడీ సిబ్బంది కిరాణా షాపుల్లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తనిఖీ చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాకేష్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

నాగులమ్మ గుడి వద్ద భక్తుల సందడి

మల్హర్, ఫిబ్రవరి 18: మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ గుడి వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతోపాటు మేడారం జాతరకు మరో కొద్ది రోజుల గడువు ఉన్న నేపథ్యంలో భక్తుల అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లిం చుకున్నారు. సహపంక్తి భోజనాలు నిర్వహిం చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావ డంతో ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది.

సీఐ మృతికి సంతాపం

కాటారం, ఫిబ్రవరి 18: కరీంనగర్ కమిషనరేట్‌లో సీసీఆర్‌బీ సీఐగా పనిచేస్తున్న సాయిరి రాజేష్ మృతికి పలువురు యువకులు, క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని క్రికెట్ గ్రౌండ్‌లో కాటారం సీఐ నాగార్జునరావుతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. రాజేష్ యువతను, క్రీడాకారులను ప్రోత్సహించే వారని కొనియాడుతూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ నేతలు విలాస్‌రావు, చీమల రాజు, సందీప్, అశోక్, నరేష్, ప్రభాకర్, ప్రభుదాస్, మహేష్, ముఫీద్ తదితరులు పాల్గొన్నారు. 2010లో కాటారం ఎస్సైగా పనిచేసిన రమేష్ కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు.